# మలుపు

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

'స్వప్న'

అందంగా నీలిరంగులో మెరిసి పోతున్న ఆ రెండుఅక్షరాలకేసి తదేకంగా చూస్తూ నిలబడ్డాడు ఆనంద్.

నగరంలో ఉన్న అయిదు నక్షత్రాల హోటల్స్‌కెల్లా అత్యాధునికమైనది, ఈ మధ్యనే మంత్రిగారి కత్తెరకి తెగిన రిబ్బన్ మధ్యనుండీ ముందుకు వచ్చిన ప్రారంభకుల అడుగుల నడితో మొదలయిన సందడి అంతకంతకు అధికమవుతూ, ఖరీదయిన అభిరుచులకి నిలయంగా 'స్వప్న' - వాస్తవరూపం దాల్చిన స్వప్నంలా ఉంది.

ఆనంద్ 'రిష్టువాచి'కేసి చూసుకున్నాడు.

ఎనిమిదీ ఇరవైమూడు నిమిషాల పదిహేను సెకండ్లు - ఎలక్ట్రానిక్ వాచీ చాలా ఖచ్చితంగా కాలం కొలత చెప్పింది. అతని దృష్టి హోటల్ ముందు ఫ్లడ్ లైట్ల వెలుగులో పైకి ఎగజిమ్ముతున్న 'ఫౌంటెన్'వైపు మళ్ళింది. మనసులో చెలరేగే ఆశలకు ప్రతిరూపంలా ఉన్నదది. అతని పెదవులమీద మందహాసం మెదలింది.

"ఎవర్ని చూసి నవ్వుతున్నావ్?"

ఉలిక్కిపడి చూశాడు.

స్వప్న!

"యూ ఆర్ లేట్ బై..."

"సిక్స్టీన్ సెకండ్స్! లోపలికి వెళ్ళి పోట్లాడుకుందాం పద..." చెయ్యి పుచ్చుకు లాక్కువెళ్ళింది.

'జాజ్' సంగీతం మృదువుగా వినిపిస్తుండగా, వెళ్ళి చెరొక కుర్చీలో ఎదురు బొదురుగా కూర్చున్నారు.

కొద్దిక్షణాలు ఒకరికళ్ళలో కొకరు తదేకంగా చూసుకున్నారు.

"ఏమిటలా చూస్తున్నావ్?" కొంటెగా నవ్వుతూ అంది.

"మనిషి అందమయిన కలలకోసం తపిస్తాడు. ఆ కలలు కనగలిగినపుడు- అవి వాస్తవమయితే ఎంత బావుణ్ణనిపిస్తుంది. వాస్తవరూపం దాల్చిన కల కరిగిపోతుందేమోనని భయం వేస్తుంది..."

"ఇపుడు నీకు భయం వేస్తోందా?"

"అవును స్వప్నా!"

"ఎందుకని? నా మీద నీకు నమ్మకం లేదా? లేక నీమీద నీకే నమ్మకం లేదా?"

"రెండూ కాదు!"

"మరి?"

"మన ప్రేమానురాగాలు దేవుడికే అసూయ కలిగించి, విధి అనే కసాయి కత్తి ఝుళిపిస్తాడేమోనని..."

పెద్దగా నవ్వింది స్వప్న.

నవ్వుతూనే వుంది.

"ష్ ఊరుకో ... పిచ్చిదనుకుంటారు..."

"పిచ్చి నాకు కాదు ఆనంద్...నీకు!"

"సరేలే — పిచ్చి నాకే ... టాపిక్ మార్చు ... వాళ్ళు మనకేసే చూస్తున్నారు..." అవతలి టేబుల్‌వాళ్ళకేసి చూస్తూ మెల్లగా అన్నాడు ఆనంద్.

అంతలో తెల్లటి యూనిఫామ్‌లో ఉన్న వెయిటరు వచ్చాడు.

"యస్ సర్..." వినయంగా వంగి కార్డు చేతికందించాడు.

"అరబ్ స్పెషల్—ఏ—అంటే?"

"ఒంటెకన్ను సార్!"

"వాట్?" అదిరిపడ్డాడు.

వెయిటరు నవ్వు దాచుకుంటూ, "ఆ ఎడారుల్లో వాళ్ళకు దొరికే స్పెషల్స్ అవే సార్!" అని "మీరు ఇండియన్ డిషెస్ అడగండి సార్...'ఐ' అక్షరం క్రిందవన్నీ మనవే..."

"అవున్సార్! ఇవాల్టినుంచీ ప్రారంభించారు. 'ఐ' కింద మళ్ళీ ఆల్ఫాబెటికల్ ఆర్డరులో మన రాష్ట్రాల పేర్లూ, ఆ రాష్ట్రాల్లో ప్రసిద్ధిచెందిన వంటకాలన్నీ మళ్ళీ అదే ఆర్డరులో ఉన్నాయి. ఉదాహరణకి మీకు గోంగూర పచ్చడి కావాలనుకోండి. 'జి' కింద చూసుకోవాలి..."

"ఇదేదో వంటల డిక్షనరీలా ఉంది కానీ, రెండు ఎమ్మెల్యే దోశెలు పట్టా పో..."

"సారీ సర్."

"ఎందుకు సారీ?" ఆశ్చర్యపోతూ ప్రశ్నించాడు.

"మీరడిగిన దోశెలు చిన్న హోటల్స్‌లో దొరుకుతాయి సార్. ఇక్కడ ఎమ్.పి. దోశె, ప్రెసిడెంట్స్ ఇడ్లీ... ప్రీమియర్ ఉప్మా...ఎంబాసిడర్ టీ... ఇంకా..."

"చాలు చాలు... రెండు ఎమ్.పి దోశెలు పట్టా..." —నవ్వుతూ వెళ్ళిపోయేడు; వెయిటరు.

"వెయిటరు చాలా గడుసువాడు సుమా" అంది స్వప్న నవ్వేస్తూ.

"స్వప్నా..."

"అవును. నా పేరు స్వప్నే. చెప్పు విషయం ఏమిటో..." కొంటెగా అంది.

"విషయం చాలా సీరియస్..."

"నేనూ చాలా సీరియస్‌గా వింటున్నాను..."

"నేను గల్ఫ్‌కి వెళదామనుకుంటున్నాను... ఒంటరిగా..."

"ఏం? అక్కడికెళ్ళి ఒంటెకన్ను తినటం ప్రాక్టీసు చేద్దామనా?"

"డోంట్ బీ సిల్లీ..."

"లేకపోతే ఒంటరిగా వెళ్ళి ఏమి సాధిద్దామని?"

"డబ్బు..."

"ఇప్పుడు నీకేం లోటు?"

"ఉంది గనకే! నీకు తెలియదు స్వప్నా... నాన్నగారు రైల్వే కాంట్రాక్టరుగా సంపాయించినదానికన్నా బయట అప్పులు చాలా ఉన్నాయి. ఆయన మధ్యప్రదేశ్‌లో పనులు చేయిస్తూ ప్రమాదంలో చనిపోయినదగ్గర్నుంచీ ఇంటి పరిస్థితులు చాలా ఘోరంగా తయారైనాయి. నామీద ఆధారపడిన అమ్మ, ఇద్దరు తమ్ముళ్లు, ఓ చెల్లాయి... వాళ్లందరినీ చూసుకోవాల్సిన బాధ్యత నామీదుంది. దానికి ఆర్థికస్తోమతు ఎంతో అవసరం. అందుకే గల్ఫ్ వెళదామని నిశ్చయించుకున్నాను. ఈలోగా నాన్నగారి కంట్రాక్టు తాలూకు బిల్స్ కొన్ని ప్యాసు చేయించి ఆ డబ్బుతో అప్పులు తీర్చాలి..."

"అంటే కంట్రాక్టుపనులు మధ్యలో ఆపేస్తావా? నువ్వు చెయ్యవా?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఏం-నేను కూడా యాక్సిడెంట్‌లో చావాలా?" ఆవేశంగా అన్నాడు.

"ఆనంద్!" ఆశ్చర్యంగా చూసింది.

"అవును స్వప్నా! నాన్నగారిది సహజమరణం కాదు ... పార్ట్‌నరే ప్రమాదం సృష్టించాడని తెలిసింది..." బాధని దిగమ్రింగుతూ అన్నాడు.

"నిజమా? మరి..." మాటలు వెతుక్కుంది.

"మరి అంతే...... ఈ విచిత్ర వ్యవస్థలో మనం ఏమీ చెయ్యలేం. నాకూ ఊహాలంటే చాలా ఇష్టం. ఆ దుర్మార్గపు కంట్రాక్టరు భరతం పట్టాలని వాడిని కటకటాల వెనక్కి పంపించాలనీ ......కానీ, యివన్నీ జరిగే పనులు కావు..."

"అంకుల్ అలా పోయారని నువ్వు చెప్పేదాకా నాకు తెలీదు ఆనంద్. అయామ్ రియల్లీ సారీ......" బాధగా అంది.


"ఇట్స్ ఓకే."

"నీ సమస్యలు నేను అర్థం చేసుకున్నాను. కానీ, నువ్వు కేవలం డబ్బు అవసరాల నిమిత్తం గల్ఫ్‌కి వెళతాననటం బాగాలేదు..."

"లేకపోతే లాటరీ టిక్కెట్లు కొనుక్కుంటూ అదృష్టం వరించటం కోసం జపం చెయ్యమంటావా?"

"అలా కాదు. ఏదైనా మంచి ఉద్యోగం కోసం ప్రయత్నించు..."

"ఉద్యోగం......" నవ్వేడు—"ఉద్యోగం మీద వచ్చే గొర్రెతోక జీతంతో నా సమస్యలు తీరేవికాదు..."



"పోనీ ఏదైనా బిజినెస్ చెయ్యి..."

"అది కూడా అనుకున్నంత తేలిక కాదు స్వప్నా. దానికి బోలెడు పెట్టుబడి కావాలి..."

"నేనిస్తాను..."

"నీ మనసిచ్చావు చాలు. అదే నాకు పెద్ద పెట్టుబడి... అదుగో ఎమ్.పి. దోసె లొచ్చాయి......ముందు ఫలహారం కానియ్యి."

• • •

"హల్లో...నమస్తే"— ఆనంద్ ఆ అపరిచిత వ్యక్తికేసి ఆశ్చర్యంగా చూస్తుండిపోయేడు. ఖరీదయిన దుస్తుల్లో, ఠీవిగా ఉన్న అందమయిన విగ్రహం. మొహానికి మరింత అందం తెస్తున్న బుల్లి గడ్డం. కళ్ళకు బంగారు ఫ్రేముతో జోడు.

"సారీ...మిమ్మల్ని గుర్తుపట్టలేదు ..." సిగ్గుపడుతూ అన్నాడు ఆనంద్.

అతను అందంగా నవ్వేడు.

కళ్ళజోడు తీసి "ఇప్పుడు గుర్తుపట్ట గలరా?" అన్నాడు.

ఆ కళ్ళు...ఎప్పుడో బాగా పరిచయం ఉన్నట్లే ఉన్నాయి. ఆ మొహకవళికలు కూడా...

"ఆల్‌రైట్...మిమ్మల్ని మరింత బాధపెట్టను. రండి......నా కారులో కూర్చుని మాట్లాడుకుందాం. బై దిబై ... మీరిప్పుడేదైనా అర్జంటు పని ఉందా?"

"ఏమీలేదు పదండి..." కుతుహలం నిండిన మనసుతో అతని వెంట నడిచాడు.

ముద్దుగా అందంగా ఉన్న మారుతీ డీలక్స్ ఎర్రరంగు కారు— ఆనంద్ కూర్చోగానే మెల్లగా ముందుకు నడిపాడు.

కొద్ది నిముషాల్లో టాంక్‌బండ్ చేరింది.

విపరీతంగా ఉన్న ట్రాఫిక్ రద్దీ లోంచి జాగ్రత్తగా డ్రైవ్‌చేస్తూ మౌనంగా ఉండిపోయాడతను. ఆనంద్ కూడ నిశ్శబ్దంగా ట్రాఫిక్‌ని చూస్తు ఉండి పోయాడు.

కారు ఒక ప్రక్కగా పార్క్‌చేసి, సిమెంటు కుర్చీలవైపు నడిచాడు అతను. వెంట ఆనంద్.

ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చున్నా రిద్దరూ.

జేబులోంచి ఖరీదయిన సిగరేట్ కేస్ తీసి, సిగరెట్ ఆఫర్ చేసాడు. ఆనంద్ ఒకటి తీసుకున్నాడు. కమ్మని మ్యూజిక్ మ్రోగే లైటర్‌తో ఆనంద్ సిగరెట్ వెలిగించి, తనోటి వెలిగించుకున్నాడు.

హుస్సేన్‌సాగర్ మీదనుండీ వీస్తున్న చల్లటి గాలి అనుభవిస్తూ విశ్రాంతిగా వెన్ను ఆన్చుకు కూచ్చున్నాక—

"నా పేరు అక్బర్..నేను సులేమాన్‌గా రబ్బాయిని..." అంటున్న అతనికేసి ఆశ్చర్యంగా చూశాడు.

"సులేమాన్ అంటే..."

"అవును—ఒకప్పుడు మీ యింట్లో పాలేరు! మీ దొడ్లో గులాబీపూలు విచ్చల విడిగా కోసి దెబ్బలు తిన్న అక్బర్‌ని నేనే..."

ఆనంద్ చేతిలోంచి సిగరెట్ పడి పోయింది.

అతనికిప్పుడు బాగా గుర్తుకొస్తోంది.

చిన్నప్పుడు-తను పల్లెటూళ్లో ఉన్న రోజులు-విశాలమైన ఇంటి ఆవరణ-ఓ ప్రక్కగా గొడ్లపాక-కుప్పిగంతులు పెట్టే ఆవుదూడలు-బుసలుకొట్టే కోడెగిత్తలు. కామధేనువుల్లాంటి ఆవులు. తండ్రీ అభి రుచికి అనుగుణంగా పాలేరు సులేమాన్ చేత పెంచబడిన గులాబీతోట - రంగు రంగుల గులాబీలతో మనోహరంగా కనుపిస్తుండేది. బాల్యచాపల్యం ఆపుకో లేక గులాబీపూలు కోసి, తండ్రి ఆగ్ర హానికి గురయిన...... అక్బర్ మాసి పోయిన చొక్కాతో, తైల సంస్కారం లేని జుత్తుతో, పొగరుబోతుగా ఉండే ఆ పదేళ్ళ అగ్బర్...ఇతనా?!

ఆనంద్ నమ్మలేకపోయాడు.

పద్దెనిమిదేళ్ళ కాలం ఇంత అద్భు తాన్ని చెయ్యగలదా?

"ఆశ్చర్యంగా ఉంది కదు?"— ఆనంద్ మొహంలోని భావాలు చదువుతు ప్రశ్నించాడు అక్బర్.

"నమ్మలేకపోతున్నాను..."

సిగరెట్ విసిరేస్తూ మందహాసం చేసాడు అక్బర్.

"మీరే కాదు. మా కుటుంబాన్ని ఆ రోజుల్లో చూసినవాళ్ళెవరూ నమ్మలేరు ...తలుచుకుంటే నాకే నమ్మకం కల గదు ఒక్కోమాటు..."

"అసలింత మార్పు ఎలా జరిగింది?"

అక్బరు అతనికేసి ఒక క్షణం చూశాడు. అతని మొహంలో కాస్త తటపటాయింపు కనుపించింది.

"మీరు అపార్థం చేసుకోనంటే నిజం చెబుతాను..."

"వాటీజ్ దేర్! నిజమే చెప్పండి ఫర్వాలేదు..."

"మా బాబాయి సలీమ్ అని ఉండే వాడు..."

"చిన్నప్పుడు చిన్న చిన్న దొంగ తనాలు చేస్తుండేవాడు అతనేగా?"

"అవును-ఆయనే. ఆ రోజుల్లోనే బొంబాయి పారిపోయి స్మగ్లింగ్ ముఠాలో చేరాడు. అక్కడితో ఆయన జాతకం తిరిగి లక్షలు సంపాయించాడు. చివరికి స్వతంత్రంగా ఆ వృత్తి చేయ దలచి హైదరాబాదుకి మకాం మార్చాడు. తనకి సాయంగా నన్ను పిలిపించు కున్నాడు.ఇప్పుడు నేనూ అదే వృత్తిలో ఉన్నాను..."

"అదా సంగతి? అలాంటిదేదో చెయ్యకపోతే ఇంత తక్కువ కాలంలో పైకి రావటం జరిగేది కాదు..."

"మీకు నేను చెప్పతగ్గవాణ్ణి కాదు గానీండి...చాలామంది అనుకొన్నట్టు

ఇది నీచమయిన వృత్తేమీ కాదు..."

"జీవనం కోసం చేసే కసాయి వృత్తికూడా నీచమయింది కాదు. ఆ మాటకొస్తే గాంధీగారు పాకీపనే అన్నింటికంటే గొప్పదని చెప్పి, దక్షిణాఫ్రికాలో ఆ పని చేసి చూపించారు కూడా..."

అది మెచ్చుకోలో, విమర్శో అర్థం కాలా.

మాటమారుస్తూ "మీ విశేషాలు చెప్పండి. చాలాకాలం తర్వాత కలుసుకున్నాం" ఆప్యాయత నిండిన గొంతుతో అన్నాడు.

ఆనంద్ మనస్సు కలుక్కుమంది ఆ ప్రశ్నకి.

అయిష్టంగానే తన పరిస్థితి చెప్పాడు. 'గల్ఫ్' వెళ్ళదలచినట్లు కూడా చెప్పాడు.

అక్బరు మొహంలో సానుభూతి పొంగింది.

"ఆనంద్ గారూ! దూరపు కొండలు నునుపంటారు. మీరు గల్ఫ్ వెళ్ళి లక్షలు తెద్దామనుకోవటం కూడా అలాంటిదే. నేను గల్ఫ్ దేశాలన్నీ తిరిగాను. అక్కడి పరిస్థితులన్నీ నాకు క్షుణ్ణంగా తెలుసు. మీలాంటివాళ్ళు తట్టుకుని చేయగల పనులు కావు...అవి..."

"కానీ, నాకు వేరే మార్గం లేదు..."

"పోనీ, మీరోపని చెయ్యండి. నా బిజినెస్ అజమాయిషీ చెయ్యండి. ఇరవై శాతం వాటా యిస్తాను... మీరు గల్ఫ్ వెళ్ళి తేగల మొత్తంకంటే అది ఎక్కువే అవుతుంది..."

అనుమానంగా చూస్తున్న ఆనంద్‌కేసి నవ్వుతూ చూసి—

"ఇందులో నా స్వార్థం ఏమీ లేదు. మీరు కాకపోతే నాకు మరొకరు తేలిగ్గా దొరుకుతారు. కానీ, చిన్ననాటి మన పరిచయం, మనం ఒక ఊరి మనుషులం కావటమే నన్నిందుకు పురికొలిపింది..."

ఆనంద్ మౌనంగా హుస్సేన్‌సాగరు నీటిలో ప్రతిబింబిస్తున్న దీపాల కాంతి కేసి చూడసాగాడు.

"మీకు పోలీసుల బెడదలాంటివేమీ లేకుండా నేను చూసుకుంటాను. అసలు నా బిజినెస్ హౌస్‌మీదకి దాడిచేసే దమ్ములెవరికీ లేవు. రాజకీయంగా నాకున్న పలుకుబడి అలాంటిది. ప్రతి ఎలక్షనుకీ మేమిచ్చే చందాలకు అమ్ముడుపోయే రాజకీయ వేత్తలు మా కొమ్ము కాస్తుంటారు..."

ఆనంద్ అతనివైపు చూశాడు.

"ఆలోచించి చెబుతా"నన్నాడు లేచి నిలబడుతూ.

"డిసీజ్ ఎ ఫెయిర్ ఆఫర్. ఇలాంటి అవకాశం నేనెవరికీ ఎప్పుడూ యివ్వలేదు. సందేహాలతో అనుమానాలతో అవకాశం వదులుకుంటే. మీరు పరిష్కరించదలుచుకున్న సమస్యల్లో సగం కూడా అవవు. పదండి...మిమ్మల్ని ఇంటిదగ్గర డ్రాప్ చేస్తాను...కారువైపు నడిచాడు అక్బరు.

• • •

అంతా మౌనంగా వింటోంది స్వప్న.

కారు వెళుతూనే ఉంది.

ఆనంద్ సీటుకి జారగిలపడి ఒక్కొక్కటే చెబుతున్నాడు.

ఆమె అతన్ని ఒక్క ప్రశ్నకూడ వెయ్యటంలేదు.

ఆనంద్ మాట్లాడటం మధ్యలో ఆపి, ఏమిటలా సీరియస్‌గా ఉన్నావ్" అన్నాడు ఆశ్చర్యంగా.

"విషయం పక్కదారి మళ్ళించకు. చెప్పదలుకున్నదంతా చెప్పెయ్యి..."

"ఇంకా చెప్పేందు కేముంది? ఒక విధంగా ఆలోచిస్తే అక్బరు ఆఫర్ మంచిదేనేమో ననిపిస్తోంది. జీవితం ముఖ్యమైన మలుపు తిరగాలంటే మంచో చెడో ఏదో చెయ్యాలి కద?" అతని మాటలు పూర్తికాకముందే వేగంగా టర్నింగ్ తిరుగుతున్న కారు కంట్రోలు తప్పి అతి కష్టం మీద ప్రమాదం తప్పించుకుంది. స్వప్న రోడ్డువారగా కారాపింది.

అప్పటికే ఆనంద్ మొహం స్టీరింగ్‌కి కొట్టుకుని, కొద్దిగా చిట్లి నెత్తురు వచ్చింది. దిగ్భ్రాంతినుండీ తేరుకుని, సీటుమీద సర్దుకూర్చుంటూ "ఏమిటి ఒక్కసారి గాభరా పెట్టేశావ్? బ్రేకులు పని చెయ్యటం లేదా?" అడిగాడు.

"పని చెయ్యకపోతే కారెలా ఆగుతుంది?"

"మరి?" చేత్తో నెత్తురు అద్దుకుంటూ ఆశ్చర్యంగా అడిగాడు.

"మలుపు తిప్పేటప్పుడు బ్రేకులు వేయకపోతే ఏమవుతుందో చూడాలనిపించింది..."

"వాట్ నాన్సెన్స్?"

"ఇటీజ్ పుల్లీ సెన్సిబుల్..."

"నీకేమయినా పిచ్చిపట్టిందా?"

"ఆ ప్రశ్న నీకు నీవే వేసుకుంటే బావుంటుంది."

"ఏమిటిది స్వప్నా...నువ్వు రోజు రోజుకీ ఇలా పెంకెగా తయారయి నా దుంప తెంచేస్తున్నావ్... అసలు నీకేమవుతోంది? మనం ఒక మాటు సైకీయాట్రిస్టు దగ్గర కెళదామా?"

"ఆ అవసరం నీకే ఎక్కువ ఉంది!"

"ఓ మైగాడ్! నువ్విలా డొంక తిరుగుళ్ళు మానేసి చెప్పదలుచుకుందేదో సూటిగా చెప్పే సెయ్. ఐ కాంట్ బేర్ దిస్ ఎనీమోర్..."

"ఒ.కే సూటిగానే చెబుతున్నాను విను. నువ్వు జస్ట్ ఫర్ దట్ డర్టీ మనీ కోసం. ఆ డర్టీమోస్ట్ ప్రొఫెషన్‌ని ఎంచుకోవటం నాకిష్టంలేదు..." తెగేసి చెప్పింది.

"మోస్ట్‌డర్టీ ప్రొఫెషనా?!"

"ముమ్మాటికీ! నాకోసం నువ్వేమీ గొప్ప త్యాగాలు చెయ్యక్కర్లేదు. కానీ, వెధవపన్లు చెయ్యకుండా ఉంటే చాలు–"

ఆనంద్ చూపులు తిప్పుకున్నాడు.

"చూడు ఆనంద్! జీవితంలో గొప్ప మార్పు వచ్చి మనం చాలా గొప్పవాళ్లు కావాలనుకోవటం తప్పుకాదు. కానీ, జీవితాన్ని మలుపు తిప్పుకునేముందు, ఎంతో నిగ్రహం అవసరం...ఇందాక చూశావ్‌గా. కారుని వేగంగా మలుపు తిప్పేటప్పుడు బ్రేకులు వెయ్యకపోతే ఏమయిందో! మన జీవితాలూ అంతే. నేనేదో ఫిలాసఫీ మాట్లాడుతున్నా ననుకోకు. ప్రతి విషయాన్నీ అనుభవపూర్వకంగా తెలుసుకోవాలనుకోవటం చాలా ప్రమాదం. ప్రయోగాలు దేని మీదయినా చెయ్యి. కానీ, జీవితంమీద మాత్రం కాదు..."

ఆనంద్ మౌనంగా— సుదూరంగా మబ్బుఅంచులమీద మెరుస్తున్న సూర్యుణ్ణి చూస్తున్నాడు.

స్వప్న మృదువుగా అతని భుజం మీద చెయ్యివేసింది.

"ఆనంద్ ... నేను నీదాన్నయినపుడు నా డబ్బు నీది కాదా? ఫూలిష్ సెంటిమెంట్స్‌లో పడిపోకు... ఒకవేళ నీకంత అభ్యంతరమే ఉంటే, పోనీ అప్పుగా తీసుకో..."

ఆనంద్ ఆమె కళ్ళలోకి చూశాడు.

అక్కడ—నిజాయితీ, నైర్మల్యము, అవధుల్లేని అనురాగం, ఒకదానివెంట ఒకటిగా అతనికగుపించాయి

"స్వప్నా! నీ ప్రపోజల్ నేను ఒప్పుకుంటున్నాను..."

అమాంతం అతన్ని గాఢంగా కౌగలించుకుని ముద్దుపెట్టేసింది.

"దట్స్‌వై ఐ లవ్‌యూ..." అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తూ అంది.

"ఇవన్నీ కార్లో చెయ్యడానికిదే మైనా ఫారిన్ అనుకున్నావా? చాలు చాల్లే ఇంటికి పద... లేకపోతే పోలీసులు న్యూసెన్సుకేసు పెడతారు..." విడిపించుకుంటూ అన్నాడు.

"నాకంత సెన్స్ లేదనుకున్నావా? నీతో తగవాడాలనే ఈ ఏకాంత ప్రదేశానికి తీసుకొచ్చాను..."

"చివరకు నువ్వే గెల్చావుగా?" ఉడికిస్తూ అన్నాడు.

"అలాగనకు ఆనంద్, ఇందులో ఓటమి గెలుపుల ప్రశ్నే లేదు. ఇది ఇద్దరి గెలుపూను... బై దిబై...నావల్ల నీకు దెబ్బతగిలినందుకు వెరీ వెరీ సారీ..."

"తగిలితే తగిలింది గానీ... ఈసారి మలుపులో బ్రేకు వెయ్యటం మానెయ్యకు..."

స్వప్న కిలకిలా నవ్వేస్తూ. కారు స్టార్టుచేసి ముందుకి దూకించింది. □

*With best compliments from :*

# D. V. S. Chit Fund Private Limited,

40-5-15/A, Siddhartha Road, Venkateswarapuram,

VIJAYAWADA-520 010.

Phone Nos : Off : 62975
Resi : 62974

*Managing Director :* **D.R.N. TAGORE**